క్లుప్తంగా

'దళితబంధు'కు దరఖాస్తు చేసుకోండి

చారకొండ: మండలంలోని దళితబంధు పథకంలో అర్హులైన వారు, గతంలో ఎంపిక కాని వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జయసుధ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హులైన వారు సంబంధిత పత్రాలతో పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులకు అందజేయాలని తెలిపారు. గురువారం మధ్యాహ్నం వరకు అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

అమ్రాబాద్: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న, ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల సంఘం అధ్యక్షులు గోపాల్, పర్వతాలు బుధవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నా తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

కాంగ్రెస్ టికెట్‌కు దరఖాస్తులు

కొల్లాపూర్: అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం నియోజకవర్గానికి చెందిన నాయకులు బుధవారం దరఖాస్తులు సమర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాముయాదవ్, కాటమోని తిరుపతమ్మ గౌడ్ గాంధీభవన్‌లో దరఖాస్తులు అందజేశారు. బీసీ నేతలుగా తాము పార్టీ బలోపేతం కోసం చేపట్టిన కార్యక్రమాల వివరాలను దరఖాస్తు పత్రాలలో పొందుపర్చామని వారు తెలిపారు.

కందనూలు: యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాము బుధవారం టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. యువజన కాంగ్రెస్‌లో పార్టీ కోసం నిరంతరం పని చేస్తూ ముందుకు సాగుతున్న తనకు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని కోరారు.

డిక్షనరీల పంపిణీ

పెద్దకొత్తపల్లి: యాపట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శ్రీశైలం ఇంగ్లిష్ డిక్షనరీలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు షాకీర్ పాష మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి గ్రామస్తులు చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో సీతారామ నాయక్, సురేష్, శ్రీశైలం, జహంగీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి

తాడూరు: మండల కేంద్రంలో పాటు ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు చేశారు.

హైవే పనులకు రైతులు సహకరించాలి

పెద్దకొత్తపల్లి: కల్వకుర్తి నుంచి ఆత్మకూర్ వరకు చేపడుతున్న 167కె నేషనల్ హైవే నిర్మాణానికి రైతులు సహకరించాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించారు. జొన్నలబొగుడ వద్ద చేపట్టిన పనులకు చెట్లను తొలగించేందుకు రైతులు అడ్డంకులు సృష్టించవద్దని సూచించారు. ఈ రహదారి పూర్తయితే కొల్లాపూర్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోపాల్ నాయక్, వెంకటస్వామి, ఎల్లస్వామి, ఈశ్వర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కందనూలు: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో 500 మంది యువకులు కార్తీక్‌గౌడ్ ఆధ్వర్యంలో చేరారు. వారికి కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో సైన్స్ ఫెయిర్

కొల్లాపూర్: పట్టణంలోని సత్యసాయి శిశుమందిరంలో బుధవారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన వస్తు, పరికరాలను ప్రదర్శించారు. 4వ తరగతి విద్యార్థిని కుందనకు అగ్రికల్చర్ క్రాప్స్ ఆర్గానిక్ ఫార్మింగ్ అంశంలో మొదటి బహుమతి, 5తరగతికి చెందిన ప్రణవ్‌కు ఇంటర్నల్ ఆర్గాన్స్ అంశంలో, ఆరాధ్యకు ఫస్ట్ ఎయిడ్ అంశంలో రెండో బహుమతి, ఐదో తరగతి హర్షిత్‌కు ఇన్నోవేషన్ చంద్రయాన్ అంశంలో మూడో బహుమతి సాధించారు. వీరికి వాసవీ క్లబ్ సభ్యులు బహుమతులను అందజేశారు.

ఆయుర్వేద వైద్య శిబిరం



బల్మూర్: మండలంలోని కొండనాగులలో బుధవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. 96 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మాత్రలను పంపిణీ చేశారు. ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు త్వరగా నయం కావడంతో పాటు సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవని డాక్టర్ గోపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.



లింగాల గురుకుల పాఠశాలలో ప్రత్యక్షంగా వీక్షిస్తున్న విద్యార్థులు



కల్వకుర్తిలో జాతీయ పతాకాలతో బీజేపీ నాయకులు

చంద్రయాన్ విజయోత్సవం

కొల్లాపూర్: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో బుధవారం పట్టణంలో సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో పటాసులు కాల్చారు. స్థానికులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక కన్వీనర్ కట్టా శ్రీనివాసులు, నరేందర్‌రెడ్డి, శేఖర్ యాదవ్, రామస్వామియాదవ్, వేణుగోపాల్‌యాదవ్, రాము, మూర్తి, వెంకటస్వామి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: చంద్రయాన్–3 విజయవంతం కావాలని బుధవారం పట్టణంలోని మైసమ్మ దేవాలయంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నర్సింహ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పాల్గొని, జాతీయ పతాకాలను ప్రదర్శించారు.

అమ్రాబాద్: మండల కేంద్రమైన పదరలో బీసీ హాస్టల్ లో విద్యార్థులు సంబరాలు నిర్వహించారు. జాతీయ జెండా ప్రదర్శించి సంతోషం పంచుకున్నారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

తాడూరు: చంద్రయాన్–3 ల్యాండింగ్‌పై మండలంలోని తుమ్మలసూగూరు పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రమోద్‌కుమార్, సుజీవన్‌రెడ్డిలు విద్యార్థులను బుధవారం అవగాహన కల్పించారు.



పదర బీసీ హాస్టల్‌లో జాతీయ పతాకంతో విద్యార్థులు

అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం జయహో చంద్రయాన్–3 కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం సామ్యానాయక్ మాట్లాడుతూ.. చంద్రయాన్–3 నుంచి సాంకేతిక ఫలితాలను పొంది ప్రపంచంలో భారతదేశ ఖ్యాతి మరింత పెరుగుతుందన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో బుధవారం చంద్రయాన్–3ని టీవీ ద్వారా వీక్షించిన విద్యార్థులు సంబరాలలో తేలియాడారు. చంద్రుడి కక్ష్యలోకి వెళ్లిన వెంటనే విద్యార్థులు ఆనందంతో కేరింతలు చేశారు. ప్రపంచంలోనే మొదటి సారిగా చంద్రయాన్–3 ప్రయోగం చేసి విజయవంతం చేసిన ఘనత మన దేశానికి, మన శాస్త్రవేత్తలకు దక్కిందని పలువురు విద్యాభిమానులు కొనియాడారు.



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న నాయకులు

గిరిజనులపై చిన్నచూపు తగదు



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

బిజినేపల్లి: రాష్ట్రంలో గిరిజనులపై రోజు రోజుకు దాడులు పెరుగుతున్నాయని, వాల్యానాయక్‌పై దాడి చేస్తే పోలీసులు మౌనంగా ఉన్నారని, మరో గిరిజన మహిళపై ఏకంగా పోలీసులే థర్డ్ డిగ్రీ ప్రయోగించి గిరిజనులను చిన్న చూపు చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ గిరిజన నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎల్‌హెచ్‌పీఎస్, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ ఉపయోగించిన పోలీసు అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని, లేకుంటే తెలంగాణ ఉద్యమం తరహాలో మరో గిరిజన ఉద్యమం రూపుదాలుస్తామన్నారు. కార్యక్రమంలో వాల్యానాయక్, రామచంద్రనాయక్, నితిన్ నాయక్, వెంకటస్వామి, తిరుపతయ్య, ముద్ద మదుసూదన్‌రెడ్డి, రాంచందర్, నసీర్ పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై ప్రజావేదిక



సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

అచ్చంపేట రూరల్: మండలంలోని గ్రామాలలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఎంపీపీ శాంతాబాయి అధ్యక్షతన నిర్వహించిన 13వ విడత సామాజిక తనఖీ ప్రజావేదిక సాఫీగా కొనసాగింది. మండలంలో ఉపాధి పనులను తనఖీ బృందాలు వారం రోజులుగా క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామ సభలలో నివేదికలను వెల్లడించారు. చివరగా ప్రజావేదికను నిర్వహించి పనులపై సమీక్షించారు. తనఖీ బృందాలు ప్రజావేదికలో పనులకు సంబంధించిన పూర్తి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అడిషనల్ రాజేశ్వరీ, ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏపీడీ శ్రీనివాసులు, జంగయ్య, నజిరోద్దీన్, కొండల్, పర్వతాలు, భాస్కర్ పాల్గొన్నారు.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి

తాడూరు: బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని కర్ణాటక ఎమ్మెల్యే ఉమానాథ్ కోటియార్ అన్నారు. మండల పర్యటనలో భాగంగా రెండో రోజు శుక్రవారం మండలంలోని బలాన్‌పల్లి తదితర గ్రామాలలో మండల స్థాయి నాయకులతో కలిసి తిరిగారు. ప్రవాస్ యోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. బలాన్‌పల్లిలోని కార్యకర్త ఇంట్లో భోజనం చేశారు. ఆయన వెంట కొండా మణెమ్మ, నాగేష్, సుబ్బారెడ్డి, బాలస్వామి, శ్రీను, చినరాయుడు, లోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్ట్..

బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలను బుధవారం ముందస్తుగా అరెస్టు చేశారు. వెంకటనారాయణ, సుధాకర్, సాంబశివుడు ఉన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం..

అచ్చంపేట: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడికి నాయకులు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు.



అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

పెద్దకొత్తపల్లి: కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్నటువంటి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను కార్యకర్తలు ప్రచారం నిర్వహించాలని కర్ణాటక చెందిన ఎమ్మెల్యే రాజేష్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జలాల్ శివుడు, శశిరేఖ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెండో ఏఎన్‌ఎంల సమ్మె

నాగర్‌కర్నూల్ రూరల్: న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ రెండో ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె బుధవారం 8వ రోజుకు చేరింది. మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ప్రభుత్వం వీరిని రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా రూ.50 లక్షలు ఇవ్వాలనిడిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో చెప్పడం తప్పా చేసిందేమీ లేదని ఆరోపించారు. కార్యక్రమంలో లక్ష్మీపతి, పర్వీనా, శ్రీవిద్య, హిమబిందు, భాగ్య, సుందరమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

నల్లమల నగార పోస్టర్లు విడుదల



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకులు

అచ్చంపేట రూరల్: పట్టణంలో సెప్టెంబర్ 10వ తేదీన బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే 'నల్లమల నగార' బహిరంగ సభ పోస్టర్లు, కరపత్రాలను బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు విడుదల చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బహుజనులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మల్లయ్య, నాగార్జున, ఈశ్వర్, జాకీర్, రమేష్, శ్రీకాంత్, రామ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బహుజన రాజ్యాధికారం

తెలకపల్లి: బీఎస్పీతోనే బహుజన రాజ్యాధికారం వస్తుందని మండల అధ్యక్షుడు శివశంకర్ అన్నారు. బుధవారం సర్వాయిపాపన్నగౌడ్ జయంతి సందర్భంగా మండల కేంద్రం నుంచి తిమ్మాజిపేట వరకు నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అన్ని రంగాలలో బహుజనులకు సమాన వాటా దక్కాలంటే బీఎస్పీతోనే సాధ్యమన్నారు.

ఆర్థికసాయం అందజేత

కోడేరు: మండలంలోని నార్యనాయక్ తండాకు చెందిన పరమేష్‌కు నేషనల్ ఫారెన్స్ సైన్స్ యూనివర్సిటీలో సీటు రావడంతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి రూ.30వేల నగదు బుధవారం అందజేశారు. దీంతో తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టు కుటుంబానికి చెక్కు..

అచ్చంపేట: బల్మూర్ మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు అనంత రవీందర్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబానికి రాష్ట్ర మీడియా అకాడమీ అండగా నిలిచింది. బుధవారం హైదరాబాదులో నిర్వహించిన జర్నలిస్టులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భార్య రజితకు రూ.లక్ష చెక్కు, ప్రతినెల రూ.3వేల పెన్షన్ చొప్పున ఐదేళ్ల పాటు బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు చైర్మన్ అల్లంనారాయణ ప్రకటించారు.

జూనియర్ అసిస్టెంట్ మృతి

అమ్రాబాద్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జాఫర్(49) బుధవారం సాయంత్రం అకాల మరణం చెందారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఈయన పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన వెంటనే కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్య సిబ్బంది తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జూనియర్ అసిస్టెంట్ అకాల మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సారా పట్టివేత

పెద్దకొత్తపల్లి: మండలంలోని సాతాపూర్ చెందిన పుట్టపద్మ సారా అమ్ముతుండగా ఎక్సైజ్ ఎస్‌ఐ ఇబ్రహీంరాజా పట్టుకొని 5 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఆమెను డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌నాయక్ ముందు బైండోవర్ చేశారు. మొదటిసారి కావడంతో సొంత పూచికత్తుపై సారా అమ్మవద్దని హెచ్చరించి వదిలేశారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి అభినందన

అచ్చంపేట: పట్టణానికి చెందిన శ్రేయ ఎంబీబీఎస్ సీటు సాధించింది. 2023 నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి సీటు సాధించడంపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బుధవారం ఆమెను అభినందించారు. మామిడిశెట్టి ఇంద్రావతి, వెంకటేశ్‌లకు ఇద్దరు కూతుర్లు. శ్రీజ ఎంబీబీఎస్‌లో 2018లో వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో సీటు సాధించగా ఇటీవల శ్రేయ వరంగల్ జిల్లా జనగామలో సీటు సాధించినట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్యే మర్రికి ఘనస్వాగతం

బిజినేపల్లి: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ తరుపున మూడో సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా మర్రిజనార్దన్‌రెడ్డి చోటు దక్కించుకుని నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా బిజినేపల్లి, తిమ్మాజిపేట మండలాలకు చెందిన నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. బైకులు, కార్ల ర్యాలీతో తిమ్మాజిపేట నుంచి బిజినేపల్లికి చేరుకుని పాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అదేవిధంగా తిమ్మాజిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



స్కూల్‌గేమ్స్‌లో సత్తా చాటాలి..

కందనూలు: ఎస్‌జీఎఫ్ మండల స్థాయిలో నిర్వహించే స్కూల్ గేమ్స్‌లో సత్తాచాటాలని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులను డీఈఓ గోవిందరాజులుతో కలిసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలకు కందనూలు పుట్టినిల్లు కావాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం పట్టణంలో అత్యాధునిక సదుపాయాలతో స్టేడియం నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పాండు, ప్రసాద్ గౌడ్, శేఖర్ బాబు, రమేష్, సత్యనారాయణ, వెంకటేష్, కృష్ణ, సుభాషిణి, శివలీల తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

వెల్దండ: గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాఘయపల్లి, కంటోనిపల్లిలో కొత్త పంచాయతీ భవనాలకు భూమి పూజ, పెద్దాపూర్‌లో రైతువేదికను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరంగా గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాఘయపల్లిలో, కంటోనిపల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున,, వెల్దండ నుంచి కంటోనిపల్లి, కుప్పగండ్ల వరకు బీటీ నిర్మాణానికి రూ.2.50కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజితారెడ్డి, వైస్‌ఎంపీపీ శాంతి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



కంటోనిపల్లిలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఆసరా పింఛన్లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం దేశానికి ఆదర్శమని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగుల కోసం పెంచిన రూ.4,016 ఆసరా పింఛన్ల పంపిణీని బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో దివ్యాంగులకు రూ. 500 మాత్రమే ఇచ్చారని, సీఎం కేసీఆర్ వచ్చాక దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తూ మొదటి సారిగా పింఛన్లు రూ.1,500 పెంచగా, రెండవ సారి రూ. 3,016 చేశారని, ప్రస్తుతం ఆ మొత్తాన్ని రూ. 4,016 నిర్ణయించి బతుకుపై భరోసా కల్పించారని అన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 3,986 మంది లబ్ధి పొందుతున్నారని, అదే విధంగా 150 మందికి బ్యాటరీ సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గం కేంద్రంలో 450 గజాల మిస్త్రీర్ణంలో దివ్యాంగుల సంక్షేమ భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీపీ శాంతాబాయి లోక్యానాయక్, రాజశేఖర్ పలువురు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు రూ.18వేల జీతం ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: గ్రామాలలో గౌరవ వేతనంతో పనిచేస్తున్న ఆశావర్కర్లకు రూ.18వేల జీతం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లతో ప్రభుత్వం వెట్టి చేయించుకుంటుందని ఆరోపించారు. శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కంటివెలుగు సర్వేలకు కూడా ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వకపోవడం ఆవేదనకు గురి చేస్తుందని తెలిపారు. కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి పోరాడిన ఆశావర్కర్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, పర్వతాలు, గీత, రామయ్య,మల్లేష్, బాలస్వామి, అశోక్, కళావతి, చంద్రకళ, శశికళ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశావర్కర్లు

కొత్త పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి



ఉప్పునుంతలలో సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

ఉప్పునుంతల: ప్రభుత్వం కొత్త పీఆర్‌సీని వెంటనే ప్రకటించి ఐఆర్ ఇవ్వాలని ఎస్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మామిళ్ల సుదర్శన్ డిమాండ్ చేశారు. బుధవారం ఉప్పునుంతల, కాంసానిపల్లి, వెల్టూరు, పెనిమిళ్ల పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంతోమంది ఉపాధ్యాయ, ఉద్యోగుల జీవితాలను కుంగదీస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. భాషా పండితులకు, పీఈటీలకు వెంటనే పదోన్నతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ ఏరియర్స్, మెడికల్, సరెండర్ తదితర బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సతీష్, విక్రమ్, వెంకట్రావ్, లక్ష్మారావు, సత్యనారాయణ, సింగోటం, శ్రీనివాస్, వెంకటయ్య, వీరోజి తదితరులు పాల్గొన్నారు.

బదిలీలపై చొరవ తీసుకోవాలి..

అమ్రాబాద్: ఉపాధ్యాయుల బదిలీలపై ఉన్నత న్యాయస్థానంలో ఉన్న కేసు పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని టీఎస్ యూటీఎఫ్ నాయకుడు కొర్ర శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం పదర మండలం వంకేశ్వరం, పదర గ్రామాల పాఠశాలలను తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కొల్లాపూర్: ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ రాజయ్యకు వినతి పత్రం అందజేశారు. పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వారిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తోందని, తమను కూడా రెగ్యులరైజ్ చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో శేఖర్, వెంకటరమణ, బాలరాజు, సూరి, నర్సింహ, కృష్ణ తదితరులున్నారు.



వినతిప్రతం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు



ట్రాన్స్‌పోర్టు వాహనం వద్ద ఎక్సైజ్ శాఖ సిబ్బంది

పట్టుకుని.. వదిలేశారు

లింగాల: మండల కేంద్రానికి చెందిన పలువురు వ్యాపారులు బుధవారం ట్రాన్స్‌పోర్టు ద్వారా హైదరాబాద్ నుంచి బెల్లం తీసుకరాగా ఎక్సైజ్ శాఖ వారు పట్టుకున్న కొద్ది సేపటికే వదిలేయడంతో అనుమానాలకు తావిస్తుంది. వ్యాపారులు మండల కేంద్రానికి బెల్లం తీసుకవస్తున్న సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ శాఖ అకస్మాత్తుగా వాహనాన్ని సోదా చేయగా 4 క్వింటాళ్లు గుర్తించారు. ఎలాంటి కేసు నమోదు చేయకుండానే వదిలేశారు. ఈ విషయంపై ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్‌ను వివరణ కోరగా.. ట్రాన్స్‌పోర్టు వాహనంలో బెల్లం వచ్చిన మాట వాస్తవమేనని, పది మంది వ్యాపారులు ఒక్కొక్కరు 40 కిలోల చొప్పున విక్రయాలకు తీసుకవచ్చారని, కొంతమంది ఒత్తిళ్ల కారణంగా వదిలేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాలలో బోనాల పండుగ ఉన్నందున బెల్లం తీసువచ్చినట్లు సమాధానమిచ్చారని ఎస్‌ఐ పేర్కొన్నారు.